


**ప్రేమ పెద్ద ఫాంటసీ!**

**ప్రతి ఒక్కరూ ఒప్పుకు తీరాల్సిన నిజం ఇది.**

**ప్రేమలోకం లోనికి అడుగు పెట్టిన వాళ్లందరికీ లోకం 'హిమాన్ అండ్ మాస్టర్స్ ఆఫ్ ద యూనివర్స్ సీరియల్'లాగా అన్పిస్తుందన్నది కూడా ప్రేమికులకు సంబంధించిన నిజమే!**

'పాతాళ భైరవి' సినిమాలో రాకుమార్తె ప్రేమలో పడ్డ తోటరాముడి అమాయకమైన సాహసానికి ఈ రోజులలో ఓ రూపం వస్తే... ఆ అవతారం పేరు 'రాంబాబు'!

**　　**　　**

కాలేజి విడిచి పెట్టారు.

అందమైన అమ్మాయిలు అలసిపోయిన రంగుల గాలిపటాల్లా గుంపుగా వస్తున్నారు. తమకు కావలసిన అమ్మాయి దృష్టిని డైవర్ట్ చేసేందుకు అప్పటి వరకు ఆవరణ బయట వేచి వున్న పైలెట్స్ (వాళ్ల చేసే విన్యాసాలను చూసి కాలేజి అమ్మాయిలు పెట్టిన నిక్ నేమ్) తమ విన్యాసాలు ప్రారంభించారు.

హడావుడిగా రజని స్టైల్‌లో సిగరెట్ ఎగరేయబోయి కింద పడేసుకునేవాళ్లు, మొహంలో కర్చీఫ్‌ని తుడుచుకునేవాళ్లు (కరెక్టే), హారన్లు నొక్కి పెట్టి తమ వాహనాన్ని ఓంగ్రడించే గాడిదల్లా ముందుకు దూకించే వాళ్లతో వాతావరణం కోలాహలంగా తయారయింది.

ఆ గుంపులో ఇంద్రాణి కోసం ఆత్రంగా వెతికాయి రాంబాబు కళ్లు.

ఆమె నడిచి వస్తోంది మలయమారుతంలా మెల్లగా!

స్టెఫీగ్రాఫ్ వంటి రంగు, క్రిస్ ఎవర్ట్ పర్సనాలిటీ, సబాటిని గ్లామర్, నటాలియా జెరెవా చురుకుదనం... సింపుల్‌గా చెప్పాలంటే గ్రాండ్‌స్లామ్ కోసం ఆహ్వానిస్తున్న గ్రాస్ కోర్టులా ఆహ్లాదంగా వుంది ఇంద్రాణి!

ఆమె ముందు తన రైడింగ్ ప్రావీణ్యతను ప్రదర్శించడం కోసం హీరోహోండా కిక్ రాడ్‌ని బలంగా తన్నాడు రాంబాబు. ఊహూ... స్టార్ట్ కాలేదు. కంగారుగా మళ్లీ ప్రయత్నించాడు. ఫోర్ స్ట్రోక్ ఇంజన్... ఫైవ్ ట్రాన్స్ మిషన్... హండ్రడ్ సి.సి.... లీటర్ ఎయిటీ కన్‌సంప్షన్ వున్న సిడి హండ్రడ్ అణుమాత్రం కూడా చలించలేదు.

మరి కాసేపు ప్రయత్నించిన రాంబాబు ఏడుపు తన్నుకొస్తున్న మొహంతో తలెత్తి చూసేసరికి ఇంద్రాణి కనుమరుగయిపోయింది.

అప్పుడు గమనించాడు. పెట్రోల్ కాక్ క్లోజ్ దిశగా వుండడాన్ని.

**　　**

"ప్రేమే నేరమౌనా?... వాపై ఈ పగేలా?...' పాటని ఇరవైమూడో సారి విని తృప్తిగా హోండా మీద తన గురుదేవుడు రామారావు దగ్గరకు బయల్దేరాడు రాంబాబు.

రామారావు రాంబాబు అన్నయ్య స్నేహితుడు.. రాంబాబు అన్నయ్య ఉద్యోగరీత్యా దూర ప్రాంతానికి వెళ్లిపోతే, రామారావు మాత్రం ఆ ఉద్యోగరీత్యానే పట్నమూ... పల్లే కాని ఆ సొంత వూళ్లోనే వుండిపోయాడు.

అన్నయ్యకి స్నేహితుడు కావడం వల్ల ఏర్పడ్డ కాసింత చనువు, గౌరవాలతో పాటు తను చదువుకునే రోజులలో మేథ్స్ డౌట్లు క్లియర్ చెయ్యడంతో అతని మేధస్సుమీద అమోఘమైన నమ్మకం రాంబాబుకి.

తన ప్రేమ శకటాన్ని నిర్లక్ష్యపు గతుకుల బాటలో నడిపి హైడ్రాలిక్ సస్పెన్షన్‌తో ఎగిరెగిరి పడేలా చేస్తున్న ఇంద్రాణి ప్రేమ గెలుచుకునేందుకు సలహా కోసం అతన్ని దర్శించాడు రాంబాబు!

"రావోయ్! రా... కూర్చో ఏమిటి విశేషాలు?" అంటూ సాదరంగా ఆహ్వానించాడు రామారావు.

కాసేపు ఆ మాటా ఈ మాటా చెప్పి చివరికి 'కమింగ్ టుది పాయింట్' అనేది లేకుండా తన ప్రేమ గురించి పెద్ద ఎల్.పి. రికార్డు రెండు ప్రక్కలా వేసేశాడు రాంబాబు.

తన ప్రేమ ఫలించాలంటే మీ సలహాయే దిక్కన్నాడు.

పోన్లే పాపం కుర్రాడు. తల మునకలుగా ప్రేమలో పడ్డాడు. ఏదో ఓ సలహా పారేస్తే ఆ ఇద్దరూ కిందా మీదా పడతారు (శ్లేషలేమీ లేవు) అనుకొని ఓ సలహా చెప్పాడు రామారావు.

అది విని ఏమీ బాగోలేదన్నాడు రాంబాబు.

మరోటి చెప్పాడు. అదీ రాంబాబుకు సంతృప్తి కలిగించలేదు.

మరొకటి... ఇంకొకటి... వేరొకటి...

ఏదీ నచ్చలేదు అతనికి.

ఇంకా ఎన్నయినా చెప్పేవాడు రాంబాబుకి. కానీ, అప్పటికే రామారావు కడుపు ఆకలో... ఆకలో అంటూ గొడవ చెయ్యడం ప్రారంభించింది. అతను భోజనం చేద్దామనుకునేటంతలో రాంబాబు రావడంతో ఆ కార్యక్రమం సాగక మహ బాధగా వుంది.

ముందు రాంబాబు ప్రేమ తాలూకు ఎల్.పి. వినేసరికే ఆకలి ఈడ్చి డొక్కలో తన్నింది. ఇక సలహాలు చెప్పి, చెప్పి నీరసం తద్వారా వెర్రి చిరాకు వచ్చి పడ్డాయి రామారావుకి.

"మోటారు సైకిల్ మీద వెళ్లి ఆ అమ్మాయిని గుద్దేయకపోయావా? ఏ కాలో విరిగేది, నీకు ఆ కాళ్ల మీద పడి వేడుకునే అవకాశమూ లభించేది" పళ్లు నూరుతూ... ముందుకు రాగా అన్నాడు రామారావు.

"అయ్య బాబోయ్! ఆ అమ్మాయి రోడ్డు మీద వెళ్తున్నప్పుడు రాంగ్‌సైడ్‌లో వచ్చి ఏ రిక్షా అయినా రాసుకుంటుందేమోనని భయపడి ఛస్తాను. ఇక నేనేం డాషివ్వగలను" అమాయకంగా చెప్పాడు రాంబాబు.

"మా నాయనే" అని మనసులో అనుకుని పైకి "పోనీ... డేర్ డెవిల్ డ్రైవర్‌లా ఫీట్సు చెయ్యక పోయావా? తన అటెన్షన్ నీ పైకి డైవర్టయ్యేది" అన్నాడు.



బీచ్‌లో పల్లీలు తింటున్నారు సునీత, శ్రీకాంత్.

"ఎప్పుడయినా నువ్వు పల్లీలమ్మావా?" ప్రశ్నించింది శ్రీకాంత్‌ని సునీత.

"ఇప్పటివరకూ లేదు. ఏం?" అయోమయంగా చూసాడు శ్రీకాంత్.

"అయితే ఇప్పుడు మొదలుపెట్టు మా అన్నయ్య వస్తున్నాడు".

—గొల్లపూడి శైలజ

22-12-89 ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక

— ఎన్. కె. నాగేశ్వరరావు



"ఆ ప్రయత్నమూ అయింది. ఏదీ సన్నసలు పట్టించుకోందే" ఈసారి ఆకలి రామారావు కడుపులోని ప్రేవుల్ని కిరకిరలాడించింది. అతడిలో అసహనం తారాస్థాయికి చేరుకుంది.

ఏదో ఒకటి చెప్పి రాంబాబుని వదిలించుకోకపోతే తను అన్యాయంగా ఆకలి చావుకు గురయిపోతానేమో నన్న భయం అతడి వెన్ను జలదరింపచేసింది.

"ఆ అమ్మాయి ఏం చదువుతుందన్నావ్?"

"బి.ఎ. ఫైనల్ హిస్టరీ మెయిన్" చెప్పాడు రాంబాబు.

"అద్గదీ సంగతి. ఈ విషయం ముందే చెప్పొచ్చుగా?" ఆనందం ప్రకటిస్తున్న రామారావు వంక విస్మయంగా చూశాడు రాంబాబు.

చరిత్ర చదివే పిల్ల శివాజీ మహారాజులాంటి వాణ్నో, పృథ్వీరాజులాంటి వాడినో ఎట్‌లీస్ట్ ఔరంగజేబులాంటి వాణ్నో లవ్ చేస్తుంది తప్ప ఇలా జాకీచాన్‌లా మోటారు సైకిల్ ఫీట్సు చేసే వాళ్లే ఎలా ప్రేమిస్తుంది. కాబట్టి నువ్వు వెంటనే ఈ దిక్కుమాలిన మోటారు సైకిల్ వదిలి అశ్వాన్ని అధిరోహించు. శూన్యంలోంచి పుష్పాన్ని సృష్టించి ఆ అమ్మాయికిచ్చుకో! నువ్వు గెలుచుకో!!!"

"మరి నాకు గుర్రమెక్కడ దొరుకుతుంది?"

రాంబాబు అత్యంత ఉత్సాహంతో బయటకు వెళ్లడం...రామారావు సిరసంగా డైనింగ్ హాల్లోకి దూరడం ఒక్కసారే జరిగిపోయాయి.

** **

రామారావు సలహా చెప్పిన మర్నాడు తెల్లవారుఝామునే లేచి గుర్రంకోసం వెదుకుతున్న రాంబాబుకు ఊరిబయట గడ్డిపరకలు కొరుకుతూ కనిపించిందది. బాగా బక్క చిక్కిపోయి వుంది. అది గడ్డి తింటూ కనిపించింది కాబట్టి గుర్రమనుకోవాలి. అదే ఖర్మా రపందు తింటూ కనబడితే మాత్రం అరేబియా గాడిద అనుకోవాల్సిందే.

ఆ గాడిదలా కన్పించే గుర్రం దగ్గర నిలబడి వున్నాడు దాని యజమాని గుడ్డి గంగన్న. అతడి పేరు గుడ్డి గంగన్నే కానీ... అతడికి సంబంధించిన ఓ కన్ను నిక్షేపంగా పనిచేస్తున్నది. ఒట్టు!

నిజం చెప్పాల్సివస్తే అతడిప్పుడా గుర్రానికి యజమానేం కాదు. బండి లాగడానికి అది పనికిరాక వదిలేసి చాలాకాలమయింది. రాత్రి శుభ్రంగా మందు కొట్టి వళ్లు తెలీక ఊరిబయట పడిపోయాడు గంగన్న.

రాంబాబు రావడానికి అయిదు నిముషాల ముందే అతడికి స్పృహ వచ్చింది.

కళ్లు తెరిచి చూసే సరికి అతడికి ఎండ తగలకుండా గుర్రం నీడ పడుతూ వుంది 'గోడా మేరా జోడా' స్టైల్లో!

గంగన్న హృదయం ద్రవించిపోయింది. ఆ గుర్రానికి ఇంకా మిగిలి వున్న స్వామి భక్తి అయితే అతడికి తెలిపిందింత వరకే— 'గంగన్న ఆధీనంలో అతడు పెట్టిన బాధలకి, తనని వదిలేసి రోడ్ల పాలు చేసిన తీరుకి' అది మనసులో కక్ష గట్టి వుందనీ... అదంతా తీర్చుకునేందుకు సాచి ఒక తన్ను తన్నేందుకు అయుత్తమయే ఘడియల్లోనే తాను మత్తులోంచి లేచాడన్నది తెలీకపోవడం గంగన్న దురదృష్టం.

"నాకు గుర్రం నడపడం నేర్పాలోయ్! అంతే కాదు నేర్చుకున్న తర్వాత ఓ రెండు గంటలు దాన్ని బయటకు ఇవ్వాలి" రాంబాబు మాటలకి 'ఇంత ప్రొద్దుటే మందు కొట్టి వొచ్చిందేవడా?' అన్న డౌటుతో చూశాడు గంగన్న. వచ్చింది రాంబాబని గ్రహించి 'లాభం' అనుకున్నాడు ఆనందంగా లోపల్లోపలే.

"అట్టాగే బాబూ! మీకు నేర్పడానికి... స్వారీ చేసినందుకు ఐదొందలు. తర్వాత రెండు గంటలు 'ఎల్' బోర్డు డ్రయివింగుకి అయిదొందలు అవుతుంది. పైగా ఈ గుర్రానికి ఇన్సూరెన్స్ కూడా లేదు."

"అంటే మొత్తం వెయ్యి రూపాయలా?" నోరు తెరిచేడు రాంబాబు.

"అదేం మాట బాబూ! ఇది బొంబాయి గిండీ రేసుకోర్సులో రంజీట్రోఫీ నెగ్గిన గుర్రం. పైగా రోజా దాణా, మాలీసూ... మీరూ ఆలోచించాల" చెప్పాడు గంగన్న.

కరవు బాధితుడి శరీరంలా వున్న డొక్కల్ని ఎగరేస్తూ, మురికి పట్టి అసహ్యంగా వున్న దాని ఆకారం వంక చూశాడు రాంబాబు. గంగన్న మాటలు నమ్మబుద్ధేయలేదు.

"సరే కానీ..." అన్నాడు ఇంద్రాణి గుర్తుకు రాగా.

జీను తెచ్చి గుర్రానికి బిగించాడు గంగన్న. అతనికి మహదానందంగా వుంది. అన్నమాట ప్రకారం ఆ రోజు మధ్యాహ్నానికల్లా ఆ నడ్డి గుర్రాన్ని తోలడం నేర్పించాడు.

సాయంత్రం రాంబాబు ట్రిమ్ముగా తయారయి వచ్చేసరికి గుర్రాన్ని శుభ్రంగా కడిగి, కొత్త నూనె అదీ రాసి నిగనిగలాడేట్టు చేశాడు.


రాంబాబు గుర్రం ఎక్కిం తర్వాత, రేసు గుర్రాలకి పట్టేసట్టు తను తాగగా మిగిలిన రమ్ పట్టించాడు. మరీ వెయ్యి రూపాయిలు గుంజి ఏమీ ఖర్చు పెట్టకపోతే బాగుండదనుకోవడంతో

రమ్ తాగగానే నడ్డి గుర్రానికి ఎక్కడలేని హుషారు వచ్చింది. ఆ ఉత్సాహంతో పాత పగ గుర్తొ

## ఫోటోగ్రాఫ్ / ఆటోగ్రాఫ్

భారత స్వాతంత్ర్యోద్యమ చరిత్రలో 1922 ఒక ప్రత్యేక ఉజ్వల ఘట్టం. శ్రీ అల్లూరి సీతారామరాజు మన్యం గిరిజన ప్రజలను మేల్కొలిపి, శ్వేత జాతి సామ్రాజ్యవాదులతో సాయుధ పోరాటానికి శంఖారావం పూరించిన కాలం. మల్లుదొర, అగ్గిరాజు, గంటం దొర వంటి అనుచరుల తోడ్పాటుతో పోరు నడిపి తెల్లవారిని గడగడ లాడించాడు. 1924, మే 7వ తేదీన బ్రిటిష్ ప్రభుత్వం శ్రీ సీతారామరాజును కాల్చి చంపినా, ఆ రెండేళ్ళ కాలంలో ఆయన ఇచ్చిన సమర స్ఫూర్తి శాశ్వత మయింది.

—సేకరణ: వై. రాజశేఖర్, ఠాగూర్ లైబ్రరీ వద్ద, ఏలూరు.



చ్చింది. లాగిపెట్టి వెనక కాళ్ళతో గంగన్నను తన్ని ముందు కురికింది.

రాంబాబు కిదేమీ తెలీదు. తెలిస్తే జాగ్రత్తపడే వాడే.

వీరోచితంగా గుర్రాన్ని పరుగెత్తిస్తూ కాలేజి వైపు వెళ్లాడు. నున్నగా వున్న తారురోడ్డు మీద కూడా గతుకుల బాటలో ప్రయాణం చేస్తున్న బస్సులా ఎగిరెగిరి పడుతూ వెడుతున్న గుర్రాన్ని, దాని మీద రాంబాబుని అందరూ ఆశ్చర్యంగా చూడసాగారు.

పడుతూ లేస్తూ వట్టి గుర్రం కాలేజీ చేరుకునేసరికి, అప్పటికి కాలేజీ వదిలి పావు గంటవ్వడంతో ఆవరణంతా ఖాళీగా వుంది. కానీ, రాంబాబు అదృష్టమో ఏమో ఇంద్రాణి ఆ రోజు లైబ్రరీకి వెళ్లి బుక్స్ రిఫర్ చేసుకుని ఆలస్యంగా వస్తూ రాంబాబుకి ఎదురైంది.

ఆనందంగా ఆమెను చూస్తూ చేతిలోని పువ్వుని స్టైయిలిష్‌గా ఆమె కందించాలని ప్రయత్నిస్తూ ఆ ప్రయత్నంలో రాంబాబు విజయం సాధించబోతూండగా అకస్మాత్తుగా వట్టి గుర్రం వాయువేగంతో పరుగెత్తి అదుపు తప్పిన అతణ్ని రోడ్డు ప్రక్క గోతిలోకి 'గోల్' చేసి, తను కూడా ఆ గోతిలోకే జారిపోయి అవక తేరుకొని పరుగెత్తింది.

రాంబాబు మాత్రం గోతిలోనే సెటిలయి పోయాడు. పాపం అతనికి తెలీదు. దానికి బండిలాగే రోజుల్నుంచీ వెనుక వేపు నుంచి శబ్దం వినబడితే వెర్రిగా పరుగెత్తడం అలవాటని, అలా పరుగెత్తకపోతే యజమాని చావబాదేవాడు. రాంబాబు దురదృష్ట మేమిటో... అతడు ఇంద్రాణికి ప్రేమపుష్పం (మందార పువ్వు కాదు కదా?) ఇవ్వబోతుండగా వెనుకవేపు నుంచి దేవీ నవరాత్రులకు చందాలు వసూలు చేస్తున్న కుర్రాళ్ళ డప్పులు గళ్ళు గళ్ళు మనిపించుకుంటూ రావడం... ఎప్పుడూ లేనిది వట్టి గుర్రం మీద మనిషి కనిపించడంతో ఆ డప్పుల్ని మరింత ఉత్సాహంగా ఆడించి తమ ఆనందాన్ని ప్రదర్శించడం...!

** **




"ఏవండోయ్...! మీరిచ్చిన దిక్కుమాలిన సలహా వల్ల ఎన్ని అనర్థాలు జరిగాయో తెలిసిందా?" కోపంగా అంది రామారావు భార్య మహాలక్ష్మి.

"ఏం జరిగిందేమిటి?" క్యూరియాసిటీ ప్రదర్శించాడు అతను.

"బంగారంలాంటి కుర్రాడు. పాపం! ఆ రాంబాబు నడుం ఫ్రాక్చరయింది. నెలదాకా కోలుకోడట. అతన్నమాయకుణ్ని చేసి, అవేం పాడు సలహాలండీ! ఆ ఏక్సిడెంట్లో ఆ వట్టి గుర్రానికి కాస్త వట్టి సరయిపోయి ఇప్పుడు మామూలుగానే నడుస్తున్నదట..."

"ఏం చేయమంటావ్? ఆ రోజు నేను ఆకలితో చస్తుంటే... సలహా సలహా అంటూ రాంబాబు మరీ విసిగిస్తే పీడా వదిలితే చాలని నోటికొచ్చినది చెప్పాను. దాన్నలా అక్షరాలా ఆ బుర్ర తక్కువ పెద్దమనిషి అమలుచేస్తాడని నేను కలగన్నానా? అందుకే కాబోలు ఆ రోజు రాంబాబు అలా వెళ్లగానే ఆకాశవాణి వాళ్ళు జనరంజనిలో "ప్రేమకోసమై వలలో పడెనే పాపం పసివాడూ' పాట వేశారు" ఆశ్చర్యపోతూ అన్నాడు రామారావు.

"మీరు మాత్రం మలయాళ మాంత్రికుడిలా ఆ అమాయకుణ్ణి "సాహసం సేయరా డింభకా!' అంటూ పాతాళభైరవి లాంటి ఆ వట్టి గుర్రానికి బలి పెట్టాలని చూశారు. ఇంకా నయం ప్రాణం మీదకి రాలేదు. ఇంతకీ ఆ రాంబాబు ప్రేమించిందెవర్నో మీకు తెలుసా...? మా చిన్నాన్న గారమ్మాయి ఇంద్రాణినే!"

"అలాగా! నాకేం తెలుసు. ఏదో ప్రేమించానంటే ఎవరో ఆడపిల్లనే అయుంటుందిలే అని పేరూ గట్రా కనుక్కోలేదు."

"అబ్బే! ఏం తెలీదు. దిక్కుమాలిన సలహా లిచ్చి నా చెల్లెలి మీదకి ఆ కుర్రాణ్ణి ప్రయోగించడం మాత్రం తెల్సు" విసురుగా అంది మహాలక్ష్మి.

"సర్లే... ముందు రాంబాబును చూసొద్దాం పద" ఆమె విసుర్నుండి తప్పించుకోవడానికి సర్దుకున్నాడు రామారావు.

"పదండి... పదండి... ఆ రాంబాబుని ఆస్పత్రిలో చేర్పించింది కూడా మా చెల్లెలే. ఇప్పుడు తన సంతంగా ప్రేమించిన అతగాడ్ని తప్ప మరెవర్నీ చేసుకోనని భీష్మించుకు కూర్చుంది అది."

ఆమె చెప్పిన ఆఖరు వాక్యం రామారావుకి ఆనందం కలిగించింది.

"గుడ్ గాడ్" అనుకున్నాడు నెమ్మదిగా.

** **

హాస్పటల్‌లో —

"ఇందూ... నీ రుణమెలా తీర్చుకోగలను... 'అబ్బా...''' మూలిగాడు రాంబాబు సగం ప్రేమ, సగం బాధ మిళితం చేసి.

"మళ్లా గుర్రాలు... ఏనుగులు ఎక్కి నా వెంట పడకుండా..." చెప్పింది ఇంద్రాణి నవ్వునాపుకుంటూ.

"ఏదేమైతేనేం? నడుం విరిగినా, ఆ వట్టి గుర్రం వల్లే మన ప్రేమ ఫలించింది. మన పెళ్లికి ఆ గుర్రం కూడా వుండి తీరాల్సిందే... 'అమ్మా...'' ఈసారి సగం పట్టుదల, సగం బాధ రాంబాబు గొంతులో.

"గ్రాంటెడ్!" చెప్పింది ఇంద్రాణి ప్రేమగా.

** **

రాంబాబు, ఇంద్రాణిల పెళ్లి —

అప్పటికే చెరి నాలుగు సీసాల రమ్ పట్టించేసిన గంగన్న, అతని గుర్రం మత్తుగా వున్న కళ్లతో రాంబాబు పెళ్లి పందిట్లో వున్నారు.

మరోసారి గంగన్నను తన్నే అవకాశం వస్తుందేమోనన్న ఆత్రుతతో చూస్తున్న గుర్రానికి దూరంగా జాగ్రత్తగా వున్నాడు గంగన్న.

అగ్నిసాక్షిగా... అశ్వసాక్షిగా ఇద్దరి పెళ్లి అయిపోయింది. "దంపతులిద్దర్నీ గుర్రం మీద ఊరేగించాలి" అన్నారెవరో.

ఇంద్రాణి పెదవులు చిరునవ్వులో విచ్చుకుంటే, రాంబాబు బుగ్గలు సిగ్గుతో ఎర్రబడ్డాయి. ఇదే మామూలుగా అయితే పెళ్లి కూతురు సిగ్గుపడి, పెళ్లి కొడుకు నవ్వాలి. కానీ వాళ్లది వైస్ వెర్సాగా జరిగింది.

నిజమే... ప్రేమొక ఫాంటసీ
ఒప్పుకుంటారు కదూ!

## తాగితే ఉరిశిక్ష!

బ్రాందీ భాయీలు 'ఉత్తర ఎమెన్' వెడితే ప్రాణాలపై ఆశ వదులుకోవలసిందే. ఎందుకంటే, ఆ దేశంలో మద్య పానం చేసిన వారిని బహిరంగంగా ప్రభుత్వం ఉరి తీయిస్తుంది. 'మద్య పానానికి అనుమతిస్తే మా దేశం కూడా అమెరికాలా అరాచక దేశంగా మారుతుంది'' అని ఆ దేశ న్యాయ శాఖ మంత్రి అబ్దుల్ హదర్ నాసర్ అన్నారు.

ఒకసారి అక్కడ ఇంజనీరుగా పని చేస్తున్న బ్రిటిష్ వ్యక్తి 'ఎలన్ హైండిల్'కు తన దేశం నుంచి 'స్కాచ్ బాటిల్' ఒకటి పోస్టు ద్వారా అందింది. చాలా కాలంగా 'స్కాచ్'కు దూరంగా వున్న ఎలన్ ఎమెన్ కఠిన దండనకు జడిసినా ఆఖరుకు అందుబాటులో వున్న 'స్కాచ్'ను చూస్తూ వుండలేక, ఓ రాత్రి పూట 'రహస్య సేవన'కు పూనుకున్నాడు. రాత్రించరులైన ఎమెన్ పోలీసులు అతన్ని పట్టుకున్నారు. ఇంకేం? ఇస్లామీ అదాలత్ అతనికి బహిరంగ ఉరిశిక్ష విధించింది. అయితే, బ్రిటన్ ఎలాగో తన పౌరుని విడిపించుకుందనుకోండి.



మద్య పానం చేసిన వ్యక్తిని ముందు అక్కడి వీధుల్లో ప్రదర్శించి ప్రజలు అతన్ని రాళ్ళతో, కుళ్ళిన టమాటాలతో కొట్టి అవమానించిన తర్వాత, ప్రజల సమక్షంలో ఉరి తీస్తారు! ఆ పాపికి తగిన శిక్ష పడిందని ప్రభుత్వం సంతృప్తి పడుతుందట.

—నల్లబెల్లి రంగయ్య